# నవ్వితే నవ్వండి!



- సేకరణ : వాసంతి మాఘుపు.

## నడువ వద్దు!




ఒక పాదచారి 'నడువ వద్దు!' అన్న సూచనకు విరుద్ధముగా రోడ్డుకు అడ్డముగా పరిగెట్టసాగాడు. అదే త్రోవలో పోతున్న మరొక్క పాదచారి ఈ ప్రవర్తనకు ఆశ్చర్యపడి అతనితో -

**పాదచారి 2** : అయ్యా! 'నడువ వద్దు' అన్న సూచనకు విరుద్ధముగా మీరెందుకు రోడ్డుకు అడ్డముగా పరిగెట్టారు?

**పాదచారి 1** : అందులో తప్పేంటంటా?

**పాదచారి 2** : 'నడువ వద్దు!' అన్న సూచన వచ్చినపుడు మనము రోడ్డుపై నడువకూడదు.

**పాదచారి 1** : అదేనయ్యా బాబూ! నేనెక్కడ నడిచాను. పరిగెట్టే కదా పోయుంటా!

**పాదచారి 2** : ???☹

## జిరాక్స్ కాపీ!

**ఆపరేటర్** : అయ్యా! నేను మీకు ఏ రకముగా సహాయపడగలను?

**కష్టమర్** : ధన్యవాదములు! ఈ పత్రమునకు నకలు (జిరాక్స్) తయారుచేసిపెట్టగలరా?

**ఆపరేటర్** : తప్పకుండా! దయచేసి అలా కూర్చోండి. (జిరాక్స్ కాపీ మరియు అసలు పత్రము తీసికొన్ని కొన్ని నిముషములలో రాగా, కష్టమర్ ఆ పత్రములను పైనుండి క్రిందికి ఎగాదిగా చూడసాగాడు.)

**ఆపరేటర్** : అయ్యా! ఏమైనా లోపమా?

**కష్టమర్** : అదే కదా చూస్తుంట. అసలు పత్రమునకు నకలుకు తేడా ఇంతవరకూ కనబడలేందే.

**ఆపరేటర్** : ?!@#$

## భవిష్యత్ కాలము!

**ఉపాధ్యాయుడు**: "నేను నిద్రపోయాను" అన్న దానిని భవిష్యత్ కాలములో చెప్పండి.

**విద్యార్థి** : "మీరు మేల్కొన్నారు."

**ఉపాధ్యాయుడు** : ☹

***నవ్వు! అది నాలుగు విధాల మేలు!!***



1. *వాస్తవములో బ్రతకడానికి.*
2. *గతమును, భవిష్యత్తును తాత్కాలికముగా మరచిపోవడానికి.*
3. *ఉత్పాదకతను పెంచడానికి.*
4. *ఆరోగ్యముగా ఉంచడానికి.*

## వింత అధికారి!

ఒక సంస్థకి కొ్రత్త ఉత్సాహముగల, వివేకరహితమైన అధికారి వచ్చాడు. కొ్రత్త ఉత్సాహములో, తన దర్పము చూపించుకోవాలనే ఆకాంక్షతో, వంటిపై తెలివిలేక ప్రవర్తించసాగాడు. పనివారు అతనికి ఎదుట పడడానికి భయపడసాగారు. ఒకసారి ఆ అధికారి వరండాలోకి వస్తూనే, అక్కడ ప్రకటన పత్రములను అతికించే ఫలకము వైపు తదేకంగా చూస్తూ ఉన్న ఒక వ్యక్తిని గమనించాడు.

**అధికారి** : ఏయ్! ఇక్కడ ఏమి చేస్తున్నావ్?

**వ్యక్తి** : రానున్న సెలవు దినములను తెలుసుకుంటున్నాను.

**అధికారి** : నీవు నీకిచ్చిన పనిని సకాలములో పూర్తిచేయడానికి జీతం ఇస్తున్నాం. ఇలా కాలం వృధా చెయ్యడము కార్యాలయ పురోగతికి అవరోధం. (కోపంతో ఊగిపోతూ) నిన్ను ఇప్పుడే ఈ నిముషమే పనిలోనుండి తీసివేస్తున్నాను. ఇదిగో నీ నెలజీతం దీనిని మించే అవకాశం లేదు. తీసికొని తక్షణమే వెళ్ళిపో!

ఆ వ్యక్తి ఎదురు మాట్లాడకుండా ఆ డబ్బులు తీసికొని అక్కడనుండి నిష్క్రమించాడు.

**అధికారి** : (కళ్ళు ఎగరేస్తూ తన క్రింది అధికారితో) అతనెవరు? అతని ఉద్యోగబాధ్యతలేంటి?

**క్రింది అధికారి** : అతను ఇక్కడ పిజ్జా అందించడానికి వచ్చిన వ్యక్తి!

**అధికారి** : ? ☹ **?**

## ఎక్స్-రే

**రోగి** : డాక్టర్! నా తలకి తీసిన ఎక్స్-రే ఏమి చూపిస్తోంది?

**డాక్టర్** : సంతోషించదగ్గ విషయం ఏమిటంటే, అది ఏమీ చూపించడం లేదు!

**రోగి** : ఆ( ☹

## పోలిక

ప్రపంచములో ఎన్ని మతాలున్నా, ఎన్ని ఆచారములున్నా అన్నీ మానవ మనుగడకు ఉపయోగపడేవే. ఈ అంతర్యాన్ని గుర్తించని కొంతమంది - వారి మతం మాత్రమే గొప్పదని, వారి ఆచారములు మాత్రమే ఆచరించదగినవని చెప్తూ, మిగిలిన మతములను, ఆచారములను దుయ్యబట్టడం మనకు తెలిసినదే. ఇలాంటి సంఘటనే వివేకానందుని పర్యటనలో ఒకసారి జరిగింది. ఆయన ఒక గ్రంధాలయమునకు వెళ్ళినపుడు, ఒక వ్యక్తి వివేకానందునితో భగవద్గీతను కించపరిచే విధముగా ఇలా అన్నాడు. ఈ గ్రంధాలయములో ఆ మూలన చూస్తే భగవద్గీత అట్టడుగున ఉంది. దాని మీద బైబిల్ ఉంది. చూసారా! అంటూ భగవద్గీతను ఎవరూ పట్టించుకోవడం లేదనే విధముగా మాట్లాడాడట.

వెంటనే వివేకానందుడు అయ్యా ఒక భవనము ఉందనుకోండి. దాని పునాదిని ఎంతమంది చూడగలరు? చాలా సందర్భములలో పునాది ఒకటి ఉందనే విషయమును మనము విస్మరిస్తాము. కాని బయటికి కనిపించే భవనాన్ని మనము ఎంతో గొప్పగా కొనియాడుతాము. కాని ఆ భవనము అలా నిలబడి ఉండడానికి ఆ పునాదే కారణమనే విషయమును గుర్తిస్తే, మనము ఎన్నటికి వేరొక మతమును గాని, ఆచారమును గాని చిన్నచూపు చూడము. అదే విధముగా భగవద్గీత మిగిలిన గ్రంధములకు పునాది వంటిది. ఈ విధముగా వివేకానందుడు వివరించగానే ఆ వ్యక్తి కనులు తెరుచుకున్నవట! *

*ఈసారికి ఇంతే! మళ్ళీ వచ్చే సంచికలో మరికొన్ని!!*